సమస్యల పరిష్కారానికి చర్యలు

సింహాచలం: రాంపురంలోని హర్షవర్ధన్ కాలనీలో సోమవారం గ్రామ సర్పంచ్ శిరీషతో కలిసి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీ లో డ్రైనేజీ సమస్య ఉందని వివరించారు. సంబంధిత పనులకు నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిరికి దేముడు, ఉపాధ్యక్షుడు కిషోర్, పార్టీ నాయకులు శ్రీరాములు, బాది రెడ్డి కిషోర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, చిత్రంలో గెడ్డం ఉమ, జెడ్పీటీసీ రాజు



పోషణ కిట్లు అందిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల

పరవాడ: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తుందని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస రావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం బాలింతలు, గర్భిణులకు ఆమె జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమాతో కలిసి సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దారు పి.కనకారావు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, వెన్నల సన్యాసిరావు పాల్గొన్నారు.

మల్లునాయుడుపాలెంలో..

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడు పాలెం సచివాలయంలో సోమవారం వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను ఎంపీపీ బోకం సూర్యకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు గర్భిణులు, బాలింతలకు అందించారు. సర్పంచ్ బోను దేముడమ్మ, ఎంపీటీసీ గొర్లి కనకరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



నగదు బహుమతులు అందజేస్తున్న సురేష్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని అమృతపురంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొదటి స్థానంలో నిలిచిన గాజువాక జట్టుకు రూ.7 వేలు,రెండో స్థానంలో నిలిచిన ఆరిపాక జట్టుకు రూ.4 వేలు,మూడో స్థానంలో నిలిచిన అమృతపురం జట్టుకు రూ.3 వేల చొప్పున వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ అందజేశారు.

టీటీడీ చైర్మన్ నియామకంపై వీహెచ్‌పీ అభ్యంతరం

సింహాచలం: టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డిని నియమించడాన్ని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నాయకులు తప్పుపట్టారు. సింహాచలంలోని శ్రీరాహ లక్ష్మీనృసింహ స్వామి తొలిపావంచా వద్ద విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత రాష్ట్ర టోలి కన్వీనర్ పూడిపెద్ది శర్మ మాట్లాడుతూ అన్యమతానికి చెందిన భూమన కరుణాకర్‌రెడ్డిని టీటీడీ చైర్మన్‌గా నియమించడం తగదన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు విజయశంకర్ ఫణీంద్ర, మాధవలత, నాగభూషణం, చంద్రశేఖర్, విజయ్‌కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

పరవాడ: మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 10న ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో హేమసుందర్రావు సోమవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు సర్పంచులు హాజరు కావాలని ఆయన కోరారు.

17 నుంచి శ్రావణమాస పూజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి సోదరి, అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మతల్లి ఆలయంలో ఈనెల 17వతేదీ నుంచి శ్రావణమాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు తెలిపారు. శ్రావణ శుక్రవారాల్లో సహస్ర కుంకుమార్చనలు నిర్వహిస్తామని చెప్పారు. పూజా కార్యక్రమాల కోసం 8897691348 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేటితో డిగ్రీ మొదటి విడత ప్రవేశాల గడువు పూర్తి

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత ప్రవేశాలకు మంగళవారంతో గడువు ముగియనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీసీతాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారంతో గడువు ముగిసినప్పటికీ మరో రోజు పెంచి ఉన్నత విద్యాశాఖ మంగళవారం వరకూ ప్రవేశాలకు అవకాశం కల్పించిందన్నారు. మొదటి విడతలో సీటు వచ్చిన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో తమ ప్రవేశాలను నిర్ధారించుకోవాలని సూచించారు.